మహిళా దినోత్సవం
సాక్షి
నారాయణపేట
రేపటికి ముందడుగు
బుధవారం । 8 । మార్చి । 2023



మళ్లీ ఆడపిల్లగానే..

'ఇంకో జన్మంటూ ఉంటే మళ్లీ ఆడపిల్లగానే పుట్టాలని కోరుకుంటున్నాం'.. అని మహిళలు ముక్తకంఠంతో అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తమ అభిరుచుల మేరకు స్వతంత్రంగానే జీవిస్తున్నామని.. అయితే కాలేజీ, పని ప్రదేశం, ప్రయాణంలో అధికంగా ఈవ్ టీజింగ్ సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. బాలికలపై వేధింపులు, మహిళలపై హింస, నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టే విధంగా మరిన్ని కఠిన శిక్షలు అమలు చేయాలని కోరుతున్నారు. మహిళలు, పురుషులు అనే భేదంలేదని, అంతా సమానమేననే దిశగా ప్రతి ఇంటిలో మార్పు రావాలని.. దీన్ని సామాజిక బాధ్యతగా అందరూ గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' బృందం చేపట్టిన సర్వేలో వెల్లడైన అంశాలతోపాటు సమాజంలో మహిళలు, పురుషుల సమానత్వం, అవగాహన, బాధ్యతపై పలువురు మహిళల మనోగతం మీ కోసం..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్


- మహిళలపై హింస, నేరాలకు కఠిన శిక్షలు..
- సమానత్వాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలి..
- 'సాక్షి' సర్వేలో ఆకాంక్షను వెలిబుచ్చిన మహిళలు




సర్వే ఇలా..

ఉమ్మడి జిల్లాలో మొత్తం ఎనిమిది విభాగాల నుంచి 100 శాంపిళ్లు సేకరించాం. మెడికల్ కాలేజీ, ప్రధాన ఆస్పత్రి, ఇంజినీరింగ్, పీజీ, డిగ్రీ కళాశాలల్లో 14 మంది చొప్పున.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఆర్టీసీలో పది మంది చొప్పున విద్యార్థినులు, యువతులు, మహిళా లెక్చరర్లు, మహిళా ప్రొఫెసర్లు, మహిళా కండక్టర్లు, మహిళా ఉద్యోగినులు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు.


మీరు మీకు నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవించగలుగుతున్నారా ?




మహిళగా మీకు ఎక్కువగా ఇబ్బంది పెట్టిన అంశం?



మీకే పూర్తి అధికారం ఉంటే మహిళల కోసం ఏమి చేస్తారు ?



మళ్లీ జన్మంటూ ఉంటే ఎలా పుట్టాలనుకుంటున్నారు ?



మహిళా శక్తిని గుర్తించాలి..



మహిళా దినోత్సవం జరపడం అనేది ఒక్క రోజుతో పోయే బాధ్యత కాదు. ప్రతి రోజు ప్రతి మహిళ దైనందిన జీవితంలో స్వేచ్ఛ, సమానత్వాన్ని ప్రతిబింబించే విధంగా ప్రతి ఒక్కరి చర్యలు ఉండాలి. ఆధునిక కాలంలో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. మహిళా శక్తిని సమాజం గుర్తించాలి. వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి సహకరిస్తే చాలు. సమానత్వం సాధించే దిశగా అడుగులు పడతాయి. ప్రతి తల్లిదండ్రులు సమాజంలో బతికే విధానంపై పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– గిరిజ మంగతాయారు, పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్

సమాజంపై అవగాహన కల్పించాలి..



ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు బాధాకరం. వాటిని చూస్తే మహిళా సమానత్వం సాధ్యమేనా అన్న ప్రశ్న మళ్లీ ఉత్పన్నమవుతుంది. అందుకు ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు సమాజంలో తోటి వారి పట్ల ఎలాంటి బాధ్యతతో వ్యవహరించాలన్న విషయాన్ని కచ్చితంగా నొక్కి చెప్పాలి. అబ్బాయే కదా ఏం చేసినా చెల్లిపోతుందనే భావన సరైంది కాదు. తోటి మహిళల పట్ల అక్కా, చెల్లి అన్న భావన రావాలి. అప్పుడు స్త్రీ, పురుష సమానత్వం సాధ్యపడుతుంది.

– పల్లవి, ఉపాధ్యాయురాలు, బీపీహెచ్‌ఎస్ పాఠశాల

విద్య, నైపుణ్యాలతో కూడిన ఉద్యోగాలు అవసరం..



ప్రపంచదేశాల్లో అనేక రాజకీయ, వాణిజ్య సంస్థల్లో మహిళలు తమదైన పాత్ర పోషించి వాటిని లాభాల బాట పట్టిస్తున్నారు. కానీ ఎక్కడా లేని విధంగా భారత్‌లో ఇంటి పని, వంట పని కేవలం మహిళల హక్కుగా రుద్దబడుతోంది. ఇది పురుషాధిక్య సమాజానికి సూచన. తమ కాళ్లపై తాము మహిళలు నిలబడాలంటే కచ్చితంగా విద్య, నైపుణ్యాలతో కూడిన ఉద్యోగాలు అవసరం. అప్పుడే మహిళలు సొంతగా ఎదగగలుగుతారు. చిన్నచిన్న దేశాలు సైతం మహిళా శక్తిని గురిస్తున్నాయి. భారత్‌లో పరిస్థితులు ఇంకా మారాల్సిన అవసరం ఉంది.

– ప్రవీణ, అధ్యాపకురాలు, పాలమూరు యూనివర్సిటీ



బాధ్యతాయుతంగా వ్యవహరించాలి..



మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు సాగుతున్నారు. మహిళల పట్ల చులకన భావం పోవాలి. అలాంటి వారి వైఖరి మారేలా చర్యలు ఉండాలి. మహిళలకు సమాజంలో గౌరవ మర్యాదలు ఇచ్చేలా.. ఆడపిల్లలను మగవాళ్లతో సమానంగా ప్రోత్సహించి ఉన్నత చదువులు చదివించేలా ప్రతి ఒక్కరి తల్లిదండ్రులు, సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. బాలికలకు ఆత్మరక్షణ కోసం పాఠశాల స్థాయిలో నిర్బంధంగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించాలి.

– శ్రీదేవి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, మహబూబ్‌నగర్

తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహం ఉండాలి



మహిళలు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలి. ప్రతి ఇంట్లో తల్లిదండ్రులు ఆడపిల్లలకు చిన్ననాటి నుంచి మంచి విద్య అందించాలి. అన్ని రంగాల్లో పనిచేసే మహిళలు పెరగాలి. ఎంచుకున్న రంగాల్లో మహిళలు అభివృద్ధి సాధించాలంటే తల్లిదండ్రులతో పాటు భర్త ప్రోత్సాహం ఎక్కువగా ఉండాలి. ప్రతి అమ్మాయిలో మనోధైర్యం, మానసిక స్థైర్యం బలోపేతం చేసుకుని ముందుకువెళ్లా. వైద్యం అభ్యసించడంలో మహిళలు ఎక్కువగా ముందుకు రావాలి.

– ప్రొఫెసర్ రాధ, గైనిక్ హెచ్‌ఓడీ

సమస్యను చూసి భయపడొద్దు..



మహిళకు సంబంధించిన హక్కులు సొంతం చేసుకోవడంతో పాటు సమస్యను చూసి భయపడకుండా.. అందులో నుంచి ఎలా బయటపడాలి అనే మార్గం వైపు చూడాలి. అన్ని విషయాలపై పూర్తిస్థాయిలో జ్ఞానం పెంచుకోవడానికి కష్టపడాలి. సరైన మార్గంలో వెళ్లడంతో పాటు ప్రతి మహిళలో నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి. మహిళలకు బలమైన రక్షణ చట్టాలు అమలు చేయాలి. అమ్మాయిలు స్వీయ జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. సమాజంలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తూ ముందుకు వెళ్లాలి.

– ప్రొఫెసర్ స్వరాజ్యలక్ష్మి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్

అండగా.. సఖి

బాలికలు మొదలు వృద్ధురాలి వరకు సమస్య ఏదైనా ఆమెకు అన్నివిధాలుగా అండగా నిలుస్తోంది సఖి కేంద్రం. లైంగిక వేధింపులు, గృహ హింస, అత్యాచారం, అక్రమ రవాణా, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, సమాజంలో ఎన్నో రకాలుగా ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి మహిళలకు నేనున్నానంటూ భరోసా ఇస్తోంది. వారికి అండగా నిలుస్తూ ఆశ్రయం కల్పిస్తోంది. ఆర్థికంగా నిలదొక్కుకొనేలా చేయూతనందిస్తోంది.

- బాధిత మహిళలను అక్కున చేర్చుకుంటున్న సఖి కేంద్రం
- ఆమెకు అండగా సేవలు
- బాలికలకు భరోసా

నారాయణపేట రూరల్: జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2019 నవంబర్‌లో సఖి కేంద్రం ప్రారంభమైంది. వ్యక్తిగత సమస్యలపై కేంద్రానికి వచ్చే వారికి న్యాయపరమైన సూచనలతో అన్నిరకాల సేవలు అందిస్తుంది. కౌన్సెలింగ్, న్యాయసేవలు, కేసు నమోదు, పోలీసు సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి కల్పిస్తున్నారు. మొదట అద్దె భవనంలో కొనసాగిన కేంద్రం తాజాగా సొంత భవనంలోకి మారింది. గృహహింస, లైంగిక వేధింపులు, అక్రమ రవాణా, అత్యాచారాలు, యాసిడ్ దాడులు, బాల్యవివాహాలు తదితర బాధితులకు ఈ కేంద్రం ద్వారా అవసరమైన సహాయం అందిస్తున్నారు. తాత్కాలిక వసతి కల్పించే వారికి అత్యవసర కిట్ అందిస్తారు. దీనిలో కొత్త దుస్తులు, టవల్, బ్రష్, సబ్బు తదితర అవసరమైన వస్తువులు ఉంటాయి. ఆపదలో ఆదుకుని వసతి, సామాజిక న్యాయసేవలు, ఆర్థిక పునరావాసం అందిస్తారు. ఇక సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్, లీగల్ కౌన్సిలర్, సోషల్ కౌన్సిలర్, పారామెడికల్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు షిఫ్టుల వారీగా 24గంటలు విధులు నిర్వహిస్తుంటారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు వాహనం ఎప్పుడు సిద్ధంగా ఉంటుంది.



నారాయణపేటలోని సఖి కేంద్రం

ఇప్పటివరకు నమోదైన కేసులు

కేసు రకం	సంఖ్య
గృహ హింస కేసులు	143
పోక్సో కేసులు	20
లైంగిక వేధింపులు	1
మిస్సింగ్	1
లవ్ ఎఫైర్స్	17
వరకట్న వేధింపులు	1
ఇతరములు	37
బాల్య వివాహాలు	17
మొత్తం	237

కూతుళ్లే ఆశాదీపాలు



కుమార్తెలతో తల్లిదండ్రులు గోపాలం, వెంకటమ్మ

మక్తల్: మక్తల్‌కు చెందిన విశ్రాంత పీఈటీ గోపాలం, వెంకటమ్మకు రూప, దీప, శిల్ప, పుష్ప సంతానం. నలుగురూ ఆడపిల్లలు కావడంతో సొంత కాళ్లపై నిలబడితే బావుంటుందని భావించారు తల్లిదండ్రులు. తల్లిదండ్రులను అర్థం చేసుకున్న కుమార్తెలు కష్టపడి చదివి, ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు. అమ్మానాన్నలు అనుకున్న విధంగా జీవితంలో నిలదొక్కుకున్నారు. పెద్దకూతురు బి.రూప పీఈటీగా కర్ని పాఠశాలలో పనిచేస్తున్నారు. రెండో కూతురు బి.దీప ఎస్‌జీటీగా మాగనూర్‌లో ప్రాథమిక పాఠశాలలో, మూడో కూతురు శిల్ప వెటర్నరీ అసిస్టెంట్‌గా కొత్తకోటలో, నాలుగో కూతురు బి.పుష్ప పీఈటీగా మహబూబ్‌నగర్‌లో పని చేస్తున్నారు. తాము అనుకున్నట్లుగా పిల్లలు నిలదొక్కుకోవడంతో తల్లిదండ్రులు గోపాలం, వెంకటమ్మ ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మగసంతానం లేదనే బాధలేదని, ఆడపిల్లలే మా ఇంటి ఆశాదీపాలు అని తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణ, అర్థం చేసుకునే భార్యా, పిల్లలు ఉండటం వల్లే అనుకున్నది సాధించగలిగామని గోపాలం పేర్కొన్నారు.

బాలికలకు షీ టీం రక్షణ

నారాయణపేట రూరల్: అభంశుభం తెలియని బాలికలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. ఎన్ని చట్టాలు ఉన్నా ఆశించిన మార్పు రావడం లేదు. చాలామంది భయపడి నేరం చేసిన వారిపై ఫిర్యాదు చేయడంలేదు. మరికొందరు పరువుపోతుందని మిన్నకుండిపోతున్నారు. దీంతో బాధితులకు న్యాయం జరగడంలేదు. ఈ నేపథ్యంలో నేరగాళ్ల నుంచి బాలికలను రక్షించడం, నేరం చేస్తే శిక్షించడానికి ప్రత్యేకంగా షీ టీమ్స్ రంగంలోకి వచ్చాయి. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచేందుకు తాజాగా ఒక యాప్ రూపొందించారు. గూగుల్ ప్లే స్టోర్‌లో పీఓసీఎస్ఓ ఈబీఓఎక్స్ (పోక్సో ఈ బాక్స్) అని టైప్ చేస్తే యాప్ కనిపిస్తుంది. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకుని www.ncpr.gov.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫిర్యాదు చేయాలి. యాప్ తెరవగానే వృత్తాకారంలో ఈ బాక్స్ కనిపిస్తుంది. క్లిక్ చేసి చిన్నారులు ఎదుర్కొంటున్న రకరకాల హింసలకు సంబంధించిన చిత్రాలు ఉంటాయి. వాటిని గమనించి దేనికి సంబంధించినదో గుర్తించి క్లిక్ చేయాలి. కేంద్ర ప్రభుత్వం బాలికల రక్షణకు ఢిల్లీ కేంద్రంగా చర్యలు ప్రారంభించింది. ప్రత్యేక బృందం పర్యవేక్షణలో ఇది పని చేస్తుంది. జిల్లా ఏర్పాటు తర్వాత మహిళా ఎస్పీ ఉన్నప్పటికీ షీ టీమ్స్ నిర్వహణ నామమాత్రంగా ఉండేది. ఎన్.వెంకటేశ్వర్లు చార్జీ తీసుకున్న తర్వాత ఎస్ఐ ర్యాంకు అధికారికి బాధ్యతలు అప్పగించి షీ టీమ్ వ్యవస్థను బలోపేతం చేశారు. జిల్లాలో 69 హాట్ స్పాట్లు గుర్తించి మహిళాపోలీసు సిబ్బంది రద్దీ ప్రాంతాల్లో మఫ్టీలో తిరుగుతూ తనిఖీలు చేస్తున్నారు. ఇక పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేకంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఏమైనా ఇబ్బందులు వస్తే డయల్ 100తో పాటు 7901022492ను సంప్రదించాలని, కంట్రోల్ రూమ్ 9492441100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీమ్స్ నిర్వాహకులు

షీ టీం వివరాలు..

ఫిర్యాదులు	పెటీ కేసులు	ఎఫ్ఐఆర్
52	17	-
కౌన్సెలింగ్ 739	అవగాహన సదస్సులు 235	

అమ్మ కలను నిజం చేశారు

ఊట్కూర్: తల్లి పడ్డ కష్టాలను కనులారా చూసిన ముగ్గురు అక్కాచెల్లెల్లు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించి అమ్మ కలను నిజం చేశారు. ఆమె అనుకున్నట్లుగానే ఉన్నతస్థాయికి ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఊట్కూర్‌కు చెందిన సుశీలమ్మ, వెంకట్‌రెడ్డి దంపతులకు భావన, సహాస, సాధన సంతానం. ముగ్గురూ ఆడపిల్లలే. కాగా తండ్రి వెంకట్‌రెడ్డి విద్యుదాఘాతానికి గురై మంచంపట్టాడు. దీంతో భార్య సుశీలమ్మ ఆర్టీసీలో కండక్టర్‌గా చేరి పిల్లలను ఉన్నత చదువులు చదివించింది. తానుపడ్డ కష్టాలు పిల్లలు పడకూడదని సమాజంలో ఉన్నత స్థానంలో నిలపాలని తాపత్రయపడింది. తల్లి శ్రమను గుర్తించిన అక్కాచెల్లెల్లు, కష్టపడి వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. భావన బీటెక్ పూర్తి చేసింది. గ్రూప్స్ రాసి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా కందుకూరు, శ్రీశైలం హైవేలో పని చేస్తోంది. సహాస బీటెక్ పూర్తి చేసి, పోలీస్ శాఖలో రెండేళ్లు ఎస్ఐగా పనిచేశారు. తర్వాత రాజీనామా చేసి, గ్రూప్స్ రాసి రెవెన్యూ డిపార్టమెంట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా సూర్యాపేటలో పనిచేస్తున్నారు. అలాగే సాధన బెంగుళూర్‌లో బీఏఎంఎస్ చదివింది. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా పని చేస్తోంది. రెండేళ్ల క్రితం ఆరు నెలల వ్యవధిలోనే తల్లి సుశీల రోడ్డు ప్రమాదంలో, తండ్రి వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు.



విధుల్లో యూనిఫామ్‌తో అక్కాచెల్లెల్లు

ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత

- శాసనమండలి ఎమ్మెల్యే కోటాలో ఎంపిక
- చల్లాకు మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి మనవడిగా బలమైన రాజకీయ నేపథ్యం
- ఏపీలో కర్నూలు జిల్లా, పాలమూరులో 4 సెగ్మెంట్లలో ప్రభావం

'చల్లా'గా ఖరారు..



చల్లా వెంకట్రామిరెడ్డిని అభినందిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తెలంగాణ శాసనమండలి ఎమ్మెల్యే కోటా అభ్యర్థులను బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మంగళవారం ప్రకటించారు. ముగ్గురు బరిలో నిలువనుండగా.. ఇందులో ఉమ్మడి పాలమూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డికి అవకాశం దక్కింది. ఈ నెల తొమ్మిదో తేదీన వీరు నామినేషన్ దాఖలు చేయనున్నారు. అసెంబ్లీలో బీఆర్‌ఎస్‌కు పూర్తిస్థాయిలో బలం ఉండడంతో వీరి ఎన్నిక లాంఛనమే కానుంది. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే స్థానిక సంస్థల కోటాలో కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, గవర్నర్ కోటాలో గోరటి వెంకన్న, పట్టభద్రుల నుంచి వాణీదేవి ఎమ్మెల్సీలుగా ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు లేకుంటే 'చల్లా' రాకతో ఎమ్మెల్సీల ప్రాతినిధ్యం ఐదుకు పెరగనుంది.

● మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డికి బలమైన రాజకీయ నేపథ్యం ఉంది. మాజీ రాష్ట్రపతి దివంగత నీలం సంజీవరెడ్డి మనవడు. ఆయన స్వగ్రామం జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఉండవెల్లి మండలం పుల్లూరు. ఆయన తండ్రి చల్లా రాంభూపాల్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా పనిచేశారు. 1962లో రాజకీయాల్లో అడుగుపెట్టిన రాంభూపాల్‌రెడ్డి 1964లో కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. అనంతరం 1967లో కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. సొంత నియోజకవర్గమైన అలంపూర్‌లో 1978లో పోటీ చేసి ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అంతేకాదు 1980–82 మధ్య అంజయ్య కేబినెట్‌లో రెవెన్యూశాఖ మంత్రిగా, భవనం వెంకట్రావు కేబినెట్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత తాత, తండ్రి రాజకీయ వారసుడిగా చల్లా వెంకట్రామిరెడ్డి అలంపూర్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. అలంపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా బరిలో నిలవడానికంటే ముందే స్థానిక పరిస్థితుల కారణంగా పుల్లూరు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి అలంపూర్ అభ్యర్థిగా టికెట్ ఆశించారు. కానీ అప్పటి కాంగ్రెస్, టీఆర్‌ఎస్ పొత్తు కారణంగా టికెట్ రాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతర కాలంలో జనరల్ స్థానంగా ఉన్న అలంపూర్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానంగా మారింది. అప్పటి నుంచి ఎక్కడా పోటీలో లేకున్నా.. నియోజకవర్గంలో బలమైన రాజకీయ నేతగా గుర్తింపు సాధించారు. ఆయన మద్దతు ఇచ్చిన అభ్యర్థుల విజయానికి సర్వశక్తులు ఒడ్డి గెలుపును సొంతం చేసుకుంటారనే పేరుంది.

అటు విస్తరణ.. ఇటు బలోపేతం

మూడు తరాల రాజకీయ అనుబంధం ఉన్న చల్లాకు ఏపీలోని కర్నూలు జిల్లాతో పాటు పాలమూరులోని అలంపూర్, కొల్లాపూర్, వనపర్తి, దేవరకద్ర నియోజకవర్గాల్లో మంచి పట్టు ఉంది. అయితే టీఆర్‌ఎస్.. బీఆర్‌ఎస్‌గా ఆవిర్భవించే క్రమంలో జనబలం ఉన్న నేతలను పార్టీలో చేర్చుకునే వ్యూహాలకు పదునుపెట్టింది. ఈ క్రమంలో బీఆర్‌ఎస్‌గా ఆవిర్భవించిన రోజే ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి తొలి చేరిక జరగడం.. చల్లా వెంకట్రామిరెడ్డికి సీఎం కేసీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం రాజకీయవర్గాల్లో సంచలనం సృష్టించింది. తాజాగా బీఆర్‌ఎస్ నుంచి శాసనమండలి ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా చల్లాను ఖరారు చేయడంపై ఆ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పక్క రాష్ట్రంలో పార్టీ విస్తరణతో పాటు పాలమూరులో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కేసీఆర్ పావులు కదుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.


SVS హాస్పిటల్, మహబూబ్‌నగర్
అంతర్జాతీయ మహిళా దినోత్సవం - 08-03-2023
మహిళలందరికీ SVS వారి శుభాకాంక్షలు
మహిళలకు ఉచిత వైద్య శిబిరం-08-03-2023 మరియు 09-03-2023
SVS హాస్పిటల్లో, 08-03-2023 మరియు 09-03-2023 నాడు మహిళలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయబడినది. ఈ శిబిరంలో క్రింద తెలుపబడిన రేట్లకే పరీక్షలు చేయబడును.
+ మహిళలందరికీ ఉచిత డాక్టర్స్ సంప్రదింపులు
+ Ultrasound Scan - Rs. 200/-
+ Mammogaphy - Rs. 200/- + 2D Echo - Rs. 400/-
వివరాలకు : 7893888529 / 6303444232 నెంబర్ల పై సంప్రదించగలరు.
Medical Superintendent SVS Hospital



ఆమె కోసం.. ఒకరోజు

- ఎనిమిది రకాల రుగ్మతలకు పరీక్షలు
- అవసరమైన వారికి మందులు పంపిణీ
- ఉమ్మడి జిల్లాలోని జనరల్ ఆస్పత్రులు, సీహెచ్‌సీల్లో సేవలు
- మహిళా దినోత్సవం సందర్భంగా నేటి నుంచి ప్రారంభం

ప్రతి మంగళవారం మహిళా క్లినిక్





అచ్చంపేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వారు వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సేవలదించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మహిళా క్లినిక్‌లను ప్రారంభిస్తోంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 100 క్లినిక్‌లు ప్రారంభించేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని జనరల్ ఆస్పత్రులు, పలు సీహెచ్‌సీలు, 24 గంటలపాటు సేవలందించే పీహెచ్‌సీల్లో మహిళా క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ క్లినిక్‌లలో ప్రతి మంగళవారం మహిళలకు వైద్య సేవలందిస్తారు. భవిష్యత్‌లో ఉమ్మడి జిల్లాలోని అన్ని కేంద్రాల్లో ఈ క్లినిక్‌లను అందుబాటులోకి తేనున్నారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు గురువారం అన్ని జిల్లాల డీఎంహెచ్‌ఓలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. మహిళా క్లినిక్‌లలో ఉండే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. రేడియోగ్రాఫర్, స్టాఫ్‌నర్సులకు ఈ నెల 6న సోమవారం హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రిలో శిక్షణ ఇచ్చారు.

ప్రత్యేకంగా ఏర్పాట్లు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న మహిళా క్లినిక్‌లను మహిళా దినోత్సవం సందర్భంగా పెద్దఎత్తున ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటిరోజు కార్యక్రమంలో గర్భిణులు, పిల్లల తల్లులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఐసీడీఎస్, అంగన్‌వాడీలు, డీఆర్‌డీఏ, ఆశా కార్యకర్తలు పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే మహిళా క్లినిక్‌ల గురించి ప్రచారం చేసేందుకు రాజకీయ నాయకులను భాగస్వాములను చేస్తోంది.

పోషకాల లోపం నిర్ధారణ

మహిళల్లో విటమిన్ 'డీ' లోపం ఉన్నట్లు ఇటీవల సర్వేలో తేలింది. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి పరిస్థితులున్నట్లు అంచనా వేసిన ఉన్నతాధికారులు, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మహిళా క్లినిక్‌లకు వచ్చిన వారికి థైరాయిడ్, విటమిన్ డీ3, బీ–12తోపాటు ఇతర పరీక్షలు చేయనున్నారు. అవసరమైన వారిని ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. లేదంటే వెంటనే మందులు ఇస్తారు. మహిళలందరికీ యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లు, పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ డిసీజెస్ టెస్టులు కూడా నిర్వంచనున్నారు. అలాగే హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ, మెడికేషన్స్, కౌన్సిలింగ్ కూడా ఉంటాయి. వీటితోపాటు పీసీఓడీ, రుతుస్రావ సమస్యలు, ఇన్‌ఫెర్టిలిటీ మేనేజ్‌మెంట్ సమస్యలను కొన్ని పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆ తర్వాత అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రెఫర్ చేస్తారు. బరువుకు సంబంధించిన అంశంలో న్యూట్రిషన్‌ను సూచించడమే కాకుండా యోగా, వ్యాయామాలకు సంబంధించిన వీడియోలను కూడా అందజేస్తారు.

వారంలో అందే సేవలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రతి వారం ఒక సేవ చొప్పున వైద్యసేవలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తుండగా.. ప్రతి బుధవారం, శనివారాలు టీకాలు, శుక్రవారం డ్రైడే, గురువారం హెల్త్‌రే క్లినిక్ వృద్ధుల కోసం వైద్యసేవలు అందించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఖాళీగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వైద్య సేవలందించేందుకు క్లినిక్‌లు ఏర్పాటు చేస్తోంది.

ఎనిమిది ప్యాకేజీల్లో..

మహిళలకు ఎనిమిది ప్యాకేజీల్లో 57 రకాల వైద్య పరీక్షలు చేయనున్నారు. ప్రాథమిక డయాగ్నోస్టిక్స్, క్యాన్సర్ స్క్రీనింగ్‌తోపాటు వెయింట్ మేనేజ్‌మెంట్, సెక్సువల్ ట్రాన్స్‌మిటెడ్ ఇన్‌ఫెక్షన్, పీసీఓడీ, రుతుస్రావ సమస్యలు, ఇన్‌ఫెర్టిలిటీ మేనేజ్‌మెంట్, మోనోపాజ్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఐవీ, యూటీఐ అండ్ పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ డిసీజెస్ తదితర సమస్యలతో వచ్చే మహిళలకు ఈ క్లినిక్‌లలో పరీక్షలు చేసి 24 గంటల్లో రిపోర్టులు అందజేస్తారు. ఈ మేరకు తెలంగాణ డయాగ్నోస్టిక్ పోర్టల్‌లో ప్రత్యేక లింక్‌ను రూపొందించారు. నమూనాల సేకరణ, కేంద్రాలకు తరలింపు కోసం ప్రత్యేక వాహనాలు, అదనపు స్టాఫ్‌ను సైతం నియమించనున్నారు.

క్యాన్సర్‌కు నిమ్స్.. ఎంఎన్‌జేలో చికిత్స

జనరల్ ఆస్పత్రి, సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ చేస్తారు. 30 ఏళ్ల పైబడిన మహిళందరికీ మొదట టెస్టును పరీక్షిస్తారు. అనుమానితులు, లక్షణాలున్న వారందరినీ జనరల్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. అక్కడ మామొగ్రామ్, కోల్పోస్కోఫీ, బయోప్సీ, పాప్స్‌మీర్ టెస్టులు చేస్తారు. వీటిలో క్యాన్సర్ నిర్ధారణ అయితే నిమ్స్, ఎంఎన్‌జేలో చికిత్స అందిస్తారు. డీఎంహెచ్‌ఓ, సూపరింటెండెంట్ సదరు బాధితులను ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్న తీరును స్వయంగా పరిశీలించాలి. ఇక మహిళా క్లినిక్‌కు వచ్చిన రోగుల వివరాలన్నీ ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తారు. వీటిని రెఫరల్ ఆస్పత్రులకు లింక్ చేస్తారు. ఆయా ఆస్పత్రుల్లో రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంటుంది. రోగి వెయిటింగ్ హాల్‌ను సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు. రెఫరల్ ఆస్పత్రులుగా మెడికల్ కాలేజీలు, టీవీవీపీ ఆస్పత్రులను వినియోగిస్తారు.

వైద్య సిబ్బందికి శిక్షణ

మహిళా డాక్టర్ ఉన్న దగ్గర మహిళా క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేయనున్న మహిళా క్లినిక్‌లకు నాగర్‌కర్నూల్ జిల్లాలో 12 ఆస్పత్రులను ఎంపిక చేసింది. వీటిలో ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేకంగా పరీక్షలు చేసి మందులు అందజేస్తాం. ఇందులో విధులు నిర్వహించే వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. మహిళా క్లినిక్‌లను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటదాస్, అదనపు డీఎంహెచ్‌ఓ, నాగర్‌కర్నూల్

అందుబాటులోకి స్పెషల్ యాప్



మహిళా క్లినిక్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఒక యాప్ రూపొందించారు. మహిళలు ప్రత్యేకంగా చెప్పుకొనేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. క్లినిక్‌కు వచ్చిన మహిళ వివరాలు, సమస్యలు, టెస్టులు, ఇచ్చే మెడిసిన్స్, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రెఫరల్ వివరాలన్నీ ఇందులో నమోదు చేస్తారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
భూత్పూర్ మండల మహిళా ప్రజాప్రతినిధులకు మద్దిగట్ల గ్రామ సోదరీమణులకు మహిళా ప్రజా ప్రతినిధులకు, అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
కదిరే ప్రియాంక
మద్దిగట్ల సర్పంచ్

ABILASHA HELPING HANDS ORGANIZATION
అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
6302908528
Dr. S.Sarojanamma
President

ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండల మహిళ ప్రజాప్రతినిధులకు, కొత్త మొల్గర గ్రామ సోదరీమణులకు, మహిళ ప్రజా ప్రతినిధులకు, శ్రేయోభిలాషులకు ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
సర్పంచ్
గ్రా॥ కొత్తమొల్గర, మం॥ భూత్పూర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
ఉమ్మడి గండీడ్ మండల మహిళలకు, మహిళా ప్రజా ప్రతినిధులకు, మహిళా సమాఖ్య సోదరీమణులకు, అంతర్జాతీయ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు.
శ్రీమతి మాధవిరాజీకుమార్ రెడ్డి
M.P.P. ఉమ్మడి గండీడ్ మండలం.

ఒంటరిగా మిగిలి.. మొక్కవోని ధైర్యంతో..



ఫైర్‌స్టేషన్ ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్న షాపులో కవిత

మహబూబ్‌నగర్‌లోని ఫైర్ స్టేషన్ ప్రాంతానికి చెందిన 37 ఏళ్ల కవిత పదో తరగతి వరకు చదవగా.. ఆమెకు 19ఏళ్ల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం తిర్మలాపూర్‌కు చెందిన ఓ వ్యక్తితో పెళ్లయింది. దురదృష్టవశాత్తు ఏడాది తిరగకుండానే భర్త కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. అప్పటికే వారికి కొన్ని నెలల పసిపాప ఉంది. పుట్టెడు దుఃఖంతో ఆమె తన చిన్నారితో కలిసి పుట్టింటికి వచ్చేసింది. అండగా ఉన్న కవిత తల్లి కొన్నాళ్లకే చనిపోయింది. తండ్రి కూడా గతంలోనే చనిపోయాడు. ఇక ఉన్న ఒక్క అక్క దివ్యాంగురాలు, అన్న మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వీరందరి బాధ్యతలు తనే మోయాల్సి వచ్చింది. స్థానికంగా ఓ ప్రైవేట్ కంపెనీలో హౌస్ కీపింగ్ పనిచేసి వారి బాగోగులు చూడసాగింది. పదేళ్ల క్రితం ఆ కంపెనీ యాజమాన్యం వేరే జిల్లాకు బదిలీ చేయడంతో పని మానేసి ఇంటి వద్దే ఉండిపోయింది. ఈ క్రమంలోనే తొమ్మిదేళ్ల క్రితం మహిళా సంఘంలో చేరి, రూ.లక్ష రుణం తీసుకుని స్థానికంగా ఓ షాపును నిర్వహిస్తోంది. అందులోనే కిరాణం, దుస్తులు, చీరలు, స్టేషనరీ ఇలా వివిధ రకాల వస్తువులను అమ్ముతోంది. 8 నెలల క్రితం కూతురికి పెళ్లి కూడా చేసింది.

– మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

నాపైనే ఇద్దరు ఆధారపడ్డారు

అక్క, అన్న నాపైనే ఆధారపడ్డారు. సొంతిల్లు కావడంతో రోడ్డు పక్కనే ఉన్నందున అందులోనే షాపు పెట్టుకున్నాను. రోజూ రూ.500 నుంచి రూ.600 వరకు గిరాకీ అవుతోంది. అందులో నుంచి రూ.300 పక్కన పెడతాను. మహిళా సంఘంలో పొదుపు కింద నెలకు రూ.250 చెల్లిస్తున్నాను. రుణ బకాయి కిస్తుగా రూ.3,000 కడుతున్నాను. షాపులో అమ్మాల్సిన వస్తువులను నేనే బయటకు వెళ్లి తీసుకొస్తాను.

– కవిత, చిలుకూరి బాలాజీ మహిళా సంఘం సభ్యురాలు, మహబూబ్‌నగర్

కేటరింగ్ చేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తూ..



లడ్డూలు, మిక్చర్‌ను చూపిస్తున్న అనసూయమ్మ

చిన్నచింతకుంటకు చెందిన అనసూయమ్మ, భర్తతో కలిసి బతుకుదెరువు నిమిత్తం 1997లో మహబూబ్‌నగర్‌కు వచ్చారు. అంతకుముందు కొన్నాళ్లు ఆమె అక్కడ బీడీలు చుడుతూ, భర్త ఓ హోటల్‌లో వంటలు చేసేవారు. అప్పటి నుంచి స్థానిక క్రిస్టియన్‌కాలనీ ఉంటున్నారు. మూడేళ్ల పాటు బీడీలు తయారీ చేసి జీవనం సాగించినా కుటుంబ పోషణ భారమైంది. భర్త కొన్నేళ్ల క్రితం కింద పడటంతో చివరకు ఇంటికే పరిమితమయ్యారు. అనంతరం బయట వారు పిలిచినప్పుడు వివిధ కార్యక్రమాల్లో వంటలు వండి వచ్చిన డబ్బుతో కాలం గడపసాగింది. ఈ క్రమంలోనే 14 ఏళ్ల క్రితం మహిళా గ్రూపులో చేరింది. పదేళ్ల నుంచి సంఘం వారు ఇచ్చిన రుణంతో ఇంట్లోనే కేటరింగ్ పని మొదలు పెట్టారు. భక్షాలు, లడ్డూ, ఖారా, కజ్జికాయలు, అరిశలు, మురుకులు, రవ్వలడ్డూ తయారు చేసి ఇతరులకు అమ్ముతున్నారు. అలా వచ్చిన డబ్బులతో ఇద్దరు కుమారులను ఇంటర్ వరకు, కూతురిని ఇంజినీరింగ్ చదివించింది. ఇప్పుడు కాస్తా ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

– మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

ఎన్నో ఇబ్బందులు పడ్డాను..

2009లో నా భర్త కింద పడ్డాడు. అప్పటి నుంచి నేనే కుటుంబాన్ని పోషించాల్సి వచ్చింది. కుక్కర్‌గా పని చేయడంతో కొంత వరకు బాగానే ఉన్నా ఆ తర్వాత మెప్మా అధికారులు, మహిళా సంఘం సభ్యులు ఇచ్చిన ఆర్థికసాయం, తోడ్పాటు ఎప్పటికీ మరిచిపోను. ప్రస్తుతం తయారు చేసే పిండివంటలు, ఇతరాలకు ఖర్చులు పోను అమ్మగా 50 శాతం లాభం వస్తోంది. కరోనా సమయంలో వీధివ్యాపారం కింద రూ.10వేలు, ఆ తర్వాత రూ.20వేలు, ఇటీవల రూ.40 వేలు రుణంగా అందింది. ఎప్పటికప్పుడు కిస్తులు కడుతూ సీజన్‌లో వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నాను.

– అనసూయమ్మ, ఇందిర మహిళా సంఘం అధ్యక్షురాలు, పాల్‌సాబ్‌గుట్ట, మహబూబ్‌నగర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
OVACARE FERTILITY CENTRE
ఓవాకేర్ సంతాన సాఫల్య కేంద్రం
ఇ.నెం:1-6-68/సి/8, మూడవ అంతస్తు, గాంధీ న్యూరో హాస్పిటల్ పైన, ఎర్రసత్యం విగ్రహం దగ్గర, పాల్‌సాబ్ గుట్ట, మహబూబ్‌నగర్.
సంతానం లేని దంపతులకు అత్యాధునిక ఇన్‌ఫర్టిలిటీ వైద్యం ఇప్పుడు మన మహబూబ్‌నగర్ పట్టణంలో
సేవలు
- ఐ.వి.ఎఫ్ (టెస్ట్‌ట్యూబ్ బేబి)
- 2డి, 3డి అల్ట్రాసౌండ్ స్కానింగ్
- హార్మోనల్ పరీక్షలు
- వీర్య పరీక్షలు
- హిస్టరోస్కోపి
- కృత్రిమ గర్భధారణ (ఐ.యు.ఐ)
- డోనర్ ఎగ్ మరియు డోనర్ స్పెర్మ్
- ట్యూబ్ టెస్ట్
- ఓవ్యూలేషన్ ఇండక్షన్
- ల్యాప్రోస్కోపి (కోతలేని ఆపరేషన్)
ఆదివారం సెలవు
సెల్: 7989717179
MBBS, DGO (Osm), MRCOG (UK)
PGD in ART (Germany)
Fellowship in Reproductive Medicine

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆత్మకూర్: మండల పరిధిలోని శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ పరిధిలోని దేవరపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి కర్నూల్ వైపు వెళ్లిన రైలు గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొట్టడంతో అతను తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వేశాఖ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. 60 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి చేతికి జ్యోతి అని పచ్చబొట్టు ఉందని మృతదేహాన్ని మంగళవారం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలియజేశారు.

మదనాపురంలో వృద్ధురాలు..

మదనాపురం: గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మంగళవారం మదనాపురం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నాలుగు రోజుల నుంచి ఉంటున్న గుర్తుతెలియని వృద్ధురాలు(65) మృతిచెందింది. మృతురాలు బూడిద రంగు అంగి ఆకుపచ్చ రంగు చీర ధరించిందని, 4.9 ఎత్తు ఉంటుందని తెలిపారు. ఎవరైనా బంధువులు ఉంటే మదనాపురం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ 8712670633ను సంప్రదించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మిడ్జిల్: మండల పరిధిలోని దోనూర్‌లో కోటయ్య(55) ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలియజేశారు. కోటయ్యకు గతంలో జరిగిన ప్రమాదంలో కాళ్లు విరిగిపోవడంతో గ్రామంలో టీ కొట్టు నడుపుకొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలియజేశారు. కుమరుడు శివకుమారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ అస్రత్ సుల్తాన్ తెలియజేశారు.

ఉద్యమకారులను మోసం చేసిన ప్రభుత్వం

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్



పుటాన్‌దొడ్డిలో మాట్లాడుతున్న ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్

ఎర్రవల్లిచౌరస్తా: స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి తెలంగాణ ఉద్యమం చేసిన ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం పక్కన బెట్టి మోసం చేసిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన బహుజన రాజ్యాధికార పాదయాత్రలో భాగంగా 197వ రోజు మంగళవారం ఇటిక్యాల మండలంలోని పుటాన్‌దొడ్డి, కోదండాపురం, వేముల, బట్లదిన్నె, ధర్మవరం, వల్లూరు గ్రామాల్లో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ధరణి పోర్టల్ ద్వారా సామాన్య ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. దీనిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా.. ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం బీఎస్పీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను తొలగించి రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులను సైతం ఆదుకుంటామన్నారు. బహుజన రాజ్యంలో ఒక్క సంతకంతో ఉద్యోగాలు, మహిళల పేరిట భూములను రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు ఆయన ఆధ్వర్యంలో పార్టీలో చేరగా.. పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అంతకు ముందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు కేశవరావు, ఉపాధ్యక్షుడు మణికుమార్, నాయకులు ఎం.జీ కృష్ణ, సురేష్‌బాబు, మహేష్, పాల్, మార్కండేయ, సాయికుమార్, మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి.. బావిలో శవమై...

కోస్గి: బంధువుల వద్దకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధురాలు బావిలో శవమై తేలిన సంఘటన గుండుమాల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన కిష్టమ్మ(70) ఈ నెల 4న కొడంగల్‌లో బంధువుల వద్దకు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిపోయింది. అటు బంధువుల వద్దకు వెళ్లకుండా, ఇటు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కిష్టమ్మ కోసం వెతికారు. ఈ క్రమంలో గ్రామంలోని ఓ రైస్ మిల్లు వద్ద బావిలో వృద్ధురాలి మృతదేహం కనిపించింది. బాధిత కుటుంబ సభ్యులు మృతురాలు కిష్టమ్మగా గుర్తించారు. కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలియజేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బల్మూర్: వరకట్న వేధింపులు భరించలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ శివానందం గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బాణాలకి చెందిన అశ్విని(26) భర్త లింగస్వామితో పాటూ అత్త రంగమ్మ కుటుంబ సభ్యులు అదనపుకట్నం తీసుకురావాలని ఏళ్లుగా వేధిస్తున్నారు. అసహనానికి గురైన మహిళ సోమవారం ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ.. మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు.


ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వేయడానికి వెళ్లి రైతు మృతి



బొక్క రాములు (ఫైల్)

గండేడ్: బోరు మోటారు నడవకపోవడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ వేయడానికి వెళ్లిన రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గండేడ్ మండలంలో చోటు చేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్దవార్వాల్‌కి చెందిన బొక్క రాములు(57) మంగళవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. వరి పంటకు నీరు వెళ్లే బోరు మోటారు నడవకపోవడంతో స్టార్టర్‌ను పరిశీలించగా రెండు ఫ్యూజుల్లో కరెంటు రావడంతో ట్రాన్స్‌పార్మర్ వద్దకు వెళ్లాడు. అక్కడ ఫ్యూజ్ ఎగిరిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసి ఫ్యూజ్ వేయడానికి పైకి ఎక్కాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసినా ఏబీ స్విచ్ ఒక ఫేజ్ వదలలేదని గమనించకపోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త. ఆయన పలు దఫాలు సర్పంచ్‌గా పోటీచేశాడు. పార్టీ సీనియర్ కార్యకర్త మృతిచెందడంతో పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, ఇతర నాయకులు పరామర్శించారు. విషయం పోలీసులకు తెలియడంతో సంఘటనా స్థలాన్ని మహమ్మదాబాద్ ఎస్‌ఐ సైదయ్య పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు.

స్నానం చేసేందుకు వెళ్లి చెరువులో యువకుడు గల్లంతు



వినయ్

నాగర్‌కర్నూల్ క్రైం: హోలీ పండుగ వేడుకల్లో పాల్గొన్న వ్యక్తి చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతయిన సంఘటన జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం చెరువులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని 13వ వార్డుకు చెందిన వినయ్(22) మంగళవారం ఉదయం స్నేహితులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నాడు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులకు ఫోన్ చేయడంతో కేసరిసముద్రం చెరువు వద్ద ఉన్నామని తెలిపారు. దీంతో స్నానం చేసేందుకు అక్కడి వెళ్లి చెరువులో దిగి ప్రమాదవశాత్తు అందులో పడి మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి రాత్రి వరకు గాలించినా మృతదేహం లభ్యం కాలేదు. దీంతో గాలింపును నిలిపివేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
MARAM VENKA REDDY INFRA వారు మహబూబ్‌నగర్‌కు అతిసమీపంలో మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పాదాల చెంత ఫ్రీ రిసార్ట్స్ సౌకర్యంతో 7Hills Sandal Wood Farms అతితక్కువ ధరలకే అమ్మబడును. సం॥ ✆ 7674934559, 9110522090.

HOUSE FOR SALE
మహబూబ్‌నగర్ టౌన్ హౌసింగ్ బోర్డ్ కాలనీ నందు స్విమ్మింగ్ పూల్ దగ్గర కొత్త కన్‌స్ట్రక్షన్‌లో ఈస్ట్ ఫేస్, 33 ఫీట్ల రోడ్డు, రెండు బెడ్ రూమ్స్‌తో 133 గజాల ఇల్లు అమ్మబడును. సంప్ర:9948654967.

SERVICES

ASTROLOGY
ఓం శ్రీ బ్రహ్మ జ్ఞాన జ్యోతిష్య పీఠం.. ఉచిత జ్యోతిష్యం ఖచ్చితమైన పరిష్కారం. 40 సంవత్సరాల అనుభవం ఉన్న విద్వాన్ మహర్షి గారిని సంప్రదించండి.. మీ జాతకం. ఫోటో. విద్య. ఉద్యోగం.. వ్యాపారం.. సంతానం.. స్త్రీ పురుష గుప్త సంబంధం. ఇంట్లో అశాంతి.. మరియు సమస్యల కొరకు. 98 66 29 68 58

WANTED
లేపాక్షి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషేంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ. 20K. ఏజెంట్ కమీషన్ 5K. Ph: 9640300074

సాక్షి ద్వారా మీ ఇష్టుల పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
HAPPY BIRTHDAY

CHANGE OF NAME
నేను H.Ramulu S/o Chennappa, పర్మిట్ No.14858733F R/o H.No.4-11, పోరుపల్లి గ్రామం, కోయిల్‌కొండ మండలం, మ.నగర్ జిల్లా, తెలంగాణ. నా పర్మిట్ రికార్డ్‌లో నా కూతురి పేరు H.Lakitha Sree గా నమోదు కాబడింది. జనన ధృవీకరణ పత్రం ప్రకారం ఆమె అసలు మరియు సరైన పేరు H.Varshini.

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
మహబూబ్‌నగర్ : 9010234478, 9010522215, 9705135557, 9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

గమనిక
– సాక్షి మేనేజ్‌మెంట్

క్లుప్తంగా...



మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిథల్

తల్లి పులి కోసం కూనల కలవరం

- రెండు రోజులు గడిచినా జాడలేని పెద్ద పులి
- తల్లి చెంతకు చేర్చేందుకు అధికారుల ముమ్మర ప్రయత్నాలు

ఆత్మకూరు రూరల్: ఏపీలోని నంద్యాల జిల్లా కొత్తపల్లె మండలం పెద్ద గుమ్మడాపురం శివార్లలోకి నాలుగు పిల్లలతో వచ్చిన తల్లి పులి జాడ రెండు రోజులైనా కానరాలేదు. తల్లి కోసం పులి కూనలు విలవిల్లాడుతున్నాయి. వాటిని తల్లి చెంతకు చేర్చేందుకు అటవీ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పులి కూనలు లభ్యమైన ప్రాంతంలో రెండు కిలోమీటర్ల వలయంలో 70 ఇన్‌ఫ్రారెడ్ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. తొలుత తల్లి పులిని గుర్తించి ఆపై ఆ ప్రాంతానికి పులి కూనలను చేర్చడం ద్వారా వాటిని తల్లితో కలపడం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తల్లి పులిని గుర్తించిన తరువాత ఒక ఎన్‌క్లోజర్‌లో పులి కూనలను అదే ప్రాంతంలో ఉంచుతారు. తల్లి వాటిని గుర్తించి దగ్గరగా వస్తే కూనలను ఎన్‌క్లోజర్ నుంచి వదులుతారు.

చేరదీస్తుందో.. లేదో!

వన్యప్రాణుల్లో పెద్ద పులి, దొమ్మల గొండి (హైనా) తమ పిల్లల విషయంలో చిత్రంగా ప్రవర్తిస్తాయి. బిడ్డలకు ఏ కారణంగా అయినా మనిషి స్పర్శ తగిలితే వాటిని తిరిగి తమ దగ్గరకు రానీయవు. మరోవైపు పిల్లలను తల్లి చెంతకు చేర్చడంలో జాప్యం జరిగితే.. తల్లి వాటిని మర్చిపోయే అవకాశం కూడా ఉంటుందంటున్నారు. కాగా, మనిషి స్పర్శ తగిలితే పులులు కూనలను తిరస్కరించడం సహజమే అయినా ఇది అన్ని సందర్భాల్లో వర్తించదని నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ పేర్కొన్నారు. పులి కూనలను అత్యంత శాస్త్రీయ పద్ధతుల్లో క్షేమంగా తల్లి వద్దకు చేరుస్తామని ప్రాజెక్టు టైగర్ ఫీల్డ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి చెప్పారు.



తిరుమలలో ముగిసిన వార్షిక తెప్పోత్సవాలు

తిరుపతి అలిపిరి/తిరుమల: తిరుమలలో 5 రోజుల పాటు జరిగిన శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ముగిశాయి. చివరి రోజు శ్రీ మలయప్పస్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా తెప్పపై విహరించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల వేదపారాయణం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనల మధ్య తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది.

నెలాఖరులోగా బకాయిలు

మార్చి చివరి కల్లా రూ. మూడు వేల కోట్ల బిల్లులు చెల్లింపు

- ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం.. పెండింగ్ సమస్యలు కొలిక్కివస్తున్నాయి
- మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు సజ్జల, ఆదిమూలపు
- ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అనుకూలమే
- ఉద్యోగ సంఘాల నేతలతో చర్చల అనంతరం వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న సజ్జల, ఆదిమూలపు సురేశ్, బొప్పరాజు తదితరులు

సాక్షి, అమరావతి: ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారికి సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరిస్తామని ఏపీ మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆదిమూలపు సురేష్ చెప్పారు. సీఎం ఆదేశాల ప్రకారం ఈ నెలాఖరుకల్లా ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.3 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ఉద్యోగ సంఘాల నాయకులతో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేష్, సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్ఆర్) చిరంజీవి చౌదరి సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం సజ్జల, ఆదిమూలపు ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. సజ్జల మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమంపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులను కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని, అందరూ కలిసికట్టుగా పనిచేయడంవల్లే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతోందన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు కొలిక్కివస్తున్నాయని చెప్పారు. కోవిడ్‌వల్ల ఉద్యోగులకు చేయాల్సిన వాటిని కొన్నింటినీ సమయానికి చేయలేకపోయామని తెలిపారు. చర్చల ద్వారానే ఆయా సమస్యలను పరిష్కరించుకోవచ్చని వారు చెప్పారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు చర్చించేందుకే సీఎం జగన్ మంత్రివర్గ ఉపసంఘాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం ఎప్పుడూ ఉద్యోగులకు అనుకూలంగానే ఉంటుందన్నారు.

బిల్లులు పెండింగ్‌లో లేకుండా చేస్తాం

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు సంబంధించిన అన్ని పెండింగ్ బిల్లులను మార్చి 31లోపు క్లియర్ చేస్తామన్నారు. ఇప్పటివరకు ఉన్న జీపీఎఫ్ పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామన్నారు. రిటైర్మెంట్‌కి సంబంధించి గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను పూర్తిగా చెల్లిస్తామన్నారు. మెడికల్ బిల్లుల్ని కూడా ఎటువంటి షరతులు లేకుండా చెల్లిస్తామని చెప్పారు. టీఏ, ఏపీజీఎల్ఐ కూడా ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో కూడా పరిష్కారం కాని అంశాలపైనా స్పష్టత ఇచ్చామన్నారు. రాబోయే రోజుల్లో ఏ బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూస్తామని మంత్రి చెప్పారు.

మార్చి 31లోగా పెండింగ్ బిల్లుల చెల్లింపు

ఉద్యోగులకు ఈ నెల 31లోగా రూ.3 వేల కోట్లకు పైగా పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మహిళా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 5 స్పెషల్ క్యాజువల్ లీవ్స్ ఇవ్వడానికి సుముఖత వ్యక్తంచేశారు. 2004కు ముందు ఎగ్జామ్స్ పాస్ అయిన వాళ్లకు సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారడానికి అనుమతించడానికి సానుకూలంగా స్పందించారు. వీఆర్ఏలకు డీఏ పునరుద్ధరణ, యూనివర్సిటీలు, ఇతర విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 62 ఏళ్ల వయోపరిమితి ఉత్తర్వులు ఇవ్వడానికీ ఒప్పుకున్నారు. గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు అవకాశం కల్పించడంతో పాటు, రెండో దశలో నియామకమైన వారికి త్వరగా ప్రొబేషన్ డిక్లరేషన్‌కు అంగీకరించారు. మేం పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచాం. వీఆర్‌వోలకు ప్రమోషన్ కోటా 75 శాతం చేయడం, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు 010 కింద వేతనాల చెల్లింపుకు డిమాండ్ చేశాం. – ఎ. వెంకట్రామిరెడ్డి, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం, ప్రభుత్వోద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు

పెండింగ్ బిల్లులు చెల్లిస్తామన్నారు

ఉద్యోగుల బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించింది. డీఏ బకాయిలను రెండు క్వార్టర్లలో క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు. రూ.3 వేల కోట్లు క్లియర్ చేస్తామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై చర్యలు తీసకుంటామని చెప్పారు. రూ.16వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే వారికి బయోమెట్రిక్ తొలగించాలని కోరాం. ఈ నెల 16న ఉద్యోగుల హెల్త్‌కార్డులకు సంబంధించి సీఎస్ దగ్గర సమావేశం ఉంది. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని కోరాం.
– బండి శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు

పెండింగ్ డీఏలపై చర్చిస్తామన్నారు

పెండింగ్ డీఏల విషయంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. సీపీఎస్ రద్దుపైనా చాలాసేపు చర్చించాం. త్వరలో మా సంఘం కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేసుకుని ఉద్యమ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాం.
– బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ జేఏసీ అమరావతి, చైర్మన్

పరిశోధన రంగంలో పరిశ్రమలూ కీలకమే!

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
- ఐఐసీటీలో 'వన్‌వీక్.. వన్ ల్యాబ్'ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: 'కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్'సంక్షిప్త నామం సీఎస్ఐఆర్‌లో 'ఐ'ని మరింత ప్రస్ఫుటంగా ముద్రించాల్సిన సమయం ఆసన్నమైందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానా శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ వ్యాఖ్యానించారు. ఎందుకంటే దేశ పరిశోధన రంగంలో పరిశ్రమలూ (ఇండస్ట్రీస్) అత్యంత కీలకమన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సీఎస్ఐఆర్‌లలో జరుగుతున్న పరిశోధనలను ప్రజలకు, పరిశ్రమ వర్గాలకు విస్తృతంగా పరిచయం చేసేందుకు కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన మంత్రిత్వ శాఖ 'వన్ వీక్.. వన్ ల్యాబ్'పేరుతో ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. హైదరాబాద్‌లోని ఐఐసీటీలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రారంభించారు. ఈనెల 12వ తేదీ వరకూ జరిగే 'వన్ వీక్ వన్ ల్యాబ్'తొలిరోజు మంగళవారం పరిశ్రమల వర్గాలతో సమావేశాలు ఏర్పాటయ్యాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందే సీఎస్ఐఆర్ వ్యవస్థాపకులు పరిశ్రమల అవసరాన్ని, ప్రాముఖ్యతనూ గుర్తించారని, క్విట్ ఇండియా ఉద్యమానికి ఏడాది ముందే 1941లో జమ్మూలో తొలి సీఎస్ఐఆర్ పరిశోధనశాల ఏర్పాటు కావడం ఇందుకు నిదర్శనమన్నారు. సీఎస్ఐఆర్ – ఐఐసీటీ పరిశోధనలు, అభివృద్ధి చేసిన మానవ వనరుల కారణంగా హైదరాబాద్....భారతదేశంలోని ఫార్మా, బయోటెక్ రంగాల్లో ఉన్నత స్థితిలో నిలబడగలిగిందని కొనియాడారు. దేశంలో సీఎస్ఐఆర్‌కు 37 పరిశోధన సంస్థలు ఉండగా.. ఏ పరిశోధనశాలలో ఏం జరుగుతోందో చాలామందికి తెలియదని, ఈ పరిస్థితిలో మార్పు రావాలని ఆయన శాస్త్రవేత్తలను కోరారు. కార్యక్రమంలో ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస రెడ్డి, ఏఐఎంసీఓ పెస్టిసైడ్స్ లిమిటెడ్ చైర్మన్ ప్రదీప్ దవే, భారత్ బయోటెక్ ఎండీ కృష్ణ ఎల్లా, ఎంఎస్ఐ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

రంగులు కడుక్కొనేందుకు మానేరులో దిగి..

- నీటమునిగి ముగ్గురు విద్యార్థులు మృతి
- హోలీ వేడుకల్లో విషాదం.. కరీంనగర్‌లో ఘటన
- మృతుల కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున సీఎం కేసీఆర్ సాయం



ఆంజనేయులు మృతదేహం



అనిల్ మృతదేహం

తిమ్మాపూర్ (మానకొండూర్): ముగ్గురు విద్యార్థులు.. చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులు. హోలీ సందర్భంగా ఉదయం కేరింతలతో రంగులు చల్లుకున్నారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తర్వాత స్నానం చేసేందుకు వెళ్లి నీటిలో మునిగి మరణించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని ఒంగోలు జిల్లా చీమకుర్తి మండలానికి చెందిన పలు కుటుంబాలు 15 ఏళ్ల క్రితం కరీంనగర్‌కు వలస వచ్చి, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. ఆయా కుటుంబాలకు చెందిన వీరాంజనేయులు (16), సంతోశ్ (13), అనిల్ (14) స్థానికంగా చదువుకుంటున్నారు. మంగళవారం హోలీ సందర్భంగా ముగ్గురూ కలిసి సంబరాలు చేసుకున్నారు. ఒళ్లంతా రంగులు నిండిపోవడంతో నగర శివారలోని మానేరు వాగులో స్నానానికని వెళ్లారు. లోతు తెలియకపోవడం, ఎవరికీ ఈత రాకపోవడం, మానేరు రివర్ ఫ్రంట్ కోసం తీసిన గుంతలు ఉండటంతో ముగ్గురూ నీటమునిగారు. అక్కడే పనులు చేస్తున్న కూలీలు గమనించి రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి ఘటనాస్థలికి చేరుకొని ఈతగాళ్ల సాయంతో మృతదేహాలు వెలికితీయించారు.

కుటుంబ సభ్యుల ఆగ్రహం..

ముగ్గురు విద్యార్థుల మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మానేరు రివర్‌ఫ్రంట్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే తమ పిల్లలు మరణించారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల వద్ద ఒక సెక్యూరిటీ గార్డ్ లేదా నది చుట్టూ ఒక కంచె వేసినా తమ పిల్లల ప్రాణాలు దక్కేవని వాపోయారు. పిల్లల చావుకు కాంట్రాక్టరే కారణమంటూ ధర్నాకు దిగారు. రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

రూ.5 లక్షల పరిహారం..

మానేరు వాగులో మునిగి ముగ్గురు పిల్లలు మృతి చెందడంపై సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసులు, అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ ఒక్కో విద్యార్థి కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించగా మంత్రి గంగుల వ్యక్తిగతంగా మరో రూ.2 లక్షల చొప్పున ఇస్తానని తెలిపారు.

కనుల పండువగా రంగనాథుని రథోత్సవం



రథం లాగుతున్న భక్తులు



పల్లకిపై ఉత్సవమూర్తులను రథంపైకి తీసుకొస్తున్న ఆలయ సిబ్బంది



పూజలు చేస్తున్న మంత్రి సతీమణి శారద

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా, శ్రీరంగాపురం మండల కేంద్రంలోని శ్రీ రంగనాథస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 10.30 గంటలకు శ్రీ రంగనాథస్వామి రథోత్సవం కనుల పండువగా కొనసాగింది. తిరిగి రాత్రి 10.30 గంటలకు రథోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విష్ణునారాయణ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అందంగా అలంకరించి వేద మంత్రోచ్చరణతో ప్రత్యేక పూజలు నిర్వహించి, గోవిందనామస్మరణతో మంగళ వాయిద్యాలతో రథంపైకి తీసుకొచ్చారు. ఆలయ ధర్మకర్తలు మహారాజశ్రీ జనుంపల్లి కృష్ణదేవరావు, వారి కుమారులు ఆరుద్ర, జెడ్పీ చైర్మన్ ఆర్ లోక్‌నాథరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి భార్య సింగిరెడ్డి వాసంతి, ఎంపీపీ గాయత్రి, ఆవుల శైలజ, సర్పంచ్ వినీలారాణి లాంఛనంగా పూజలు చేసి ప్రధాన ఆలయం నుంచి రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. అనంతరం భక్తులు రథం లాగుతూ గోదాదేవి ఆలయం వరకు తీసుకొచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు రంథాన్ని తిరిగి ఆంజనేయ స్వామి ఆలయం వరకు తీసుకొచ్చారు.

భక్తులకు అన్నదానం..

ఆలయం వద్ద శ్రీరంగాపురం సేవా సమితి వారు భక్తులకు అన్నదానం, వాలీబాల్ అసోసియేషన్ వారు తాగునీరు, నారాయణదాసు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. రథోత్సవం సమయంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా వనపర్తి డీఎస్పీ, కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. జాతర ప్రాంతానికి దూరంగా వాహనాలు నిలిపివేశారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా అలివేలు మంగతాయారు తిరుకల్యాణ మహోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ అలివేలు మంగతాయారు తిరుకల్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగవైభవంగా కొనసాగింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తుల మధ్య అమ్మవారి ఉత్సవం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ముందుగా శేషవాహనంలో వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగతాయారు దేవతామూర్తులను ఉంచి దేవస్థానంలోని గర్భగుడి నుంచి పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ.. కల్యాణకట్ట వద్దకు తీసుకొచ్చారు. మామిడి తోరణాలు, వివిధ రకాల పూలు, శోభాయమానంగా అలంకరించిన కల్యాణకట్ట మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి, అలివేలు మంగతాయారు దేవతామూర్తులకు పట్టువస్త్రధారణ చేశారు. అనంతరం పురోహితుల వేదమంత్రాల మధ్య కల్యాణోత్సవాన్ని జరిపించారు. కల్యాణోత్సవం అనంతరం దేవతామూర్తులను శేషవాహనంలో మళ్లీ గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఉత్సవాలకు హాజరైన భక్తులు చాలా మంది దేవస్థానంలో కూడా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

■ కల్యాణోత్సవానికి రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సతీమణి శారద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అలివేలు మంగతాయారు కల్యాణోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపుగా తీసుకొచ్చారు.

తెలంగాణ తిరుపతి మన్యంకొండ

మన్యంకొండ వెంకన్నను మొక్కితే తిరుపతికి వెళ్లిన ఫలం దక్కుతుందని భక్తుల నమ్మకమని, తవ్వని కోనేరు, చెక్కని పాదాలు, ఉలి ముట్టని విగ్రహంతో ప్రసిద్ధి గాంచిన మన్యంకొండ బ్రహ్మోత్సవాలకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని మంత్రి సతీమణి శారద తెలియజేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు మధుసూదన్



పల్లకిలో ఉత్సవమూర్తుల ఊరేగింపు



అమ్మవారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వట్టెం వెంకన్నాలయంలో.. 'తిరుపతి' అనుభూతి

- సినీనటి నమ్రత శిరోద్కర్



బిజినేపల్లి: మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని సందర్శించుకున్న తనకు తిరుమల తిరుపతి దేవస్థానం స్థాయి అనుభూతి కలిగిందని సినీనటి, సూపర్‌స్టార్ మహేష్‌బాబు సతీమణి నమ్రత శిరోద్కర్ అన్నారు. ఈ ఆలయ పర్వతం దైవనామ స్మరణతో మార్మోగుతూ.. ప్రశాంత వాతావరణానికి నెలవైందని అన్నారు. ఈ ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత మరే ఆలయంపై టీటీడీ స్థాయి అనుభూతి తనకు కలుగలేదన్నారు. తాను శ్రీవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల వేళ స్వామి వారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మంగళవారం శ్రీవేంకటేశ్వరస్వామి తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాల వేళ ఉదయం కల్యాణ ప్రాప్తి కోసం శ్రీలక్ష్మి నారాయణస్వామి ఇష్టి హోమం పూజలు ప్రత్యేకంగా నిర్వహించారు. రాత్రి హోమం, బలి, శేషవాహన సేవ కార్యక్రమాలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు.

ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు

- నిర్వాహకుల తప్పిదంతోనే సంఘటన
- ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

మన్ననూర్: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకులం పాఠశాల విద్యార్థిని నిఖిత ఆత్మహత్యకు కారకులైన వారందరిని గుర్తించి కఠిన చర్యలు తీసుకునేందుకు తనవంతు బాధ్యత తీసుకుంటానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడో తరగతి చదువుతున్న చిన్నారి నిఖిత ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. విద్యార్థులకు ప్రస్తుతం పరీక్షల సమయం ఎంతో అమూల్యమైందని, తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలను ఎవరూ కూడా ఇళ్లకు తీసుకెళ్లొద్దని అన్నారు. ఇప్పటికే వెళ్లిన విద్యార్థులు రేపటి వరకు తిరిగి పాఠశాలకు వచ్చేలా చూడాలని సూచించారు. ఆత్మహత్యకు పాల్పడిన నిఖిత కుటుంబానికి దళితబంధు ద్వారా రూ.10 లక్షలు, అసైన్డ్ భూమి దొరికితే ఎకరం, రెండు ఎకరాలు ఇప్పించే ఏర్పాటుతో పాటూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, కొంత మొత్తంలో ఎక్స్‌గ్రేషియా ఇప్పిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ.. పాఠశాల నిర్వహణ లోపంతోనే విద్యార్థిని నిఖిత ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి..

పాఠశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి నిర్లక్ష్య విధానాలతోనే నిఖిత ఆత్మహత్యకు పాల్పడిందని బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు, విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. కొన్ని ఏళ్లుగా ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్ తన వ్యక్తిగతం కోసమే ఉద్యోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం కార్యదర్శి తిరుపతయ్య, నాయకులు డాక్టర్ విష్ణుమూర్తి, శంకర్, ప్రగతిశీల విద్యార్థుల సంఘం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు ఎంవీఎఫ్ వెంకటేష్, పి.బాలయ్య, గోపాల్, కాశీం పాల్గొన్నారు.

కందూర్‌లో అశ్వవాహన సేవ



చిన్న తేరు అశ్వవాహనంపై కొలువైన స్వామి

అడ్డాకుల: మండల పరిధిలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద స్వామి వారి బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి తర్వాత స్వామి వారికి అశ్వవాహనసేవ నిర్వహించారు. ఆలయం ముందున్న చిన్న తేరును పూజారులు శుద్ధి చేశారు. ఆలయంలోని స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పూజారులు తీసుకొచ్చి చిన్న తేరుపై ఉన్న అశ్వవాహనంపై అలంకరించారు. అనంతరం తేరు ముందు పండితులు హోమం నిర్వహించారు. భక్తులంతా కలిసి ఆలయం ముందున్న తేరును కొద్ది దూరం ముందుకు తీసుకెళ్లి అశ్వవాహనసేవను ముగించారు. మంగళవారం ఉదయం ఉదయం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, బలిహరణ తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. గ్రామంలోని స్వామి వారి వెండి ముఖం, నాగపడగలను రాత్రి పల్లికిలో ఉంచి గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. సర్పంచ్ వి.శ్రీకాంత్, ఎంపీటీసీ శ్యామలమ్మ, ఈఓ రాజేశ్వరశర్మ, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, అర్చకులు మణికంఠ శివాచార్య, రామలింగశర్మ పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి దళితుల దాసంగాలు

మండల పరిధిలోని కందూర్ శివారులో వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామికి ఆచారం ప్రకారం మంగళవారం సాయంత్రం దళితులు దాసంగాలను సమర్పించారు. కొత్త కుండలో వంటలు చేసి స్వామి వారికి దాసంగం పెట్టి మొక్కులు చెల్లించారు. అదేవిధంగా పెళ్లి కాని యువతి, యువకులు, పెళ్లై సంతానం కలగని వారు, ఇతర మొక్కులు మొక్కుకున్న వారు అఖండ జ్యోతిని తలపై పెట్టుకుని ప్రదక్షిణలు చేశారు.

కొనసాగుతున్న నీటి విడుదల

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి విడతల వారీగా నీటిని విడుదల చేస్తున్నారు. గత నెల 28 నుంచి నాలుగో తడి కింద కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు కింద ఉన్న 12 వేల ఎకరాల ఆయకట్టు భూములకు నీటిని అందిస్తున్నారు. యాసంగి పంటల సాగు కింద అయిదు తడులుగా విడతల వారీగా నీటిని విడుదల చేయడానికి అధికారులు గతంలోనే షెడ్యూల్ ఖరారు చేశారు. ఇప్పటి వరకు నాలుగు తడులుగా నీటి విడుదల పూర్తయింది. మంగళవారం కుడి కాల్వ నీటి విడుదలను నిలిపి వేశారు. బుధవారం ఎడమ కాల్వ నీటి విడుదలను నిలిపి వేస్తారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 20 అడుగుల నీటి మట్టం ఉంది. పది రోజుల తరువాత చివరి తడి కింద నీటిని వదిలే అవకాశం ఉంది.